ప్రజాశక్తి


శనివారం 27 జులై 2024 5 శ్రీ సత్యసాయి





సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్



ఎమ్మెల్యే VS 'టు మెన్'

◆ పరస్పరం అధిష్టానానికి ఫిర్యాదులు
◆ ప్రతి పనిలో నువ్వా...మేమా...
◆ శింగనమల అధికార పార్టీలో గ్రూపు తగాదాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శింగనమల నియోజకవర్గంలో అధికార పార్టీలో గ్రూపు తగాదాలు తారా స్థాయికి చేరుతున్నాయి. ఎన్నికలకు ముందు నుంచి ఈ గ్రూపు తగాదాలు నడుస్తూనే ఉన్నాయి. ఎక్కడా లేని విధంగా శింగనమల నియోజకవర్గంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జితో పాటు టుమెన్ కమిటీని వేశారు. ఈ టూమెన్ కమిటీకి, నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న బండారు శ్రావణికి మధ్య పొసగలేదు. పరస్పరం కేసులు కూడా నమోదు చేసుకోవడం జరిగింది. ఈ గొడవల మధ్యనే ఎన్నికలు జరగడం... బండారు శ్రావణి ఎమ్మెల్యేగా గెలుపొందడం జరిగాయి. టిడిపి అధికారంలోకి వచ్చాక కూడా ఈ నియోజకవర్గంలో టుమెన్ కమిటీకి, ఎమ్మెల్యే బండారు శ్రావణికి మధ్య ప్రతి విషయంలోనూ తగాదాలు నడుస్తూనే ఉన్నాయి. నువ్వా... మేమా అన్నట్టుగా వ్యవహారాలు నడుస్తున్నాయి.



మూడు రోజుల క్రితం బుక్కరాయసముద్రం పోలీసు స్టేషన్ వద్ద వాదులాడుకుంటున్న టిడిపి మద్దతుదారులు (ఫైల్‌ఫొటో)

రచ్చకెక్కి అధిష్టానంకు పరస్పరం ఫిర్యాదులు

ఈ రెండు గ్రూపుల పంచాయతీ అధిష్టానం పెద్దల వద్దకు చేరుతోంది. టుమెన్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బండారు శ్రావణిపై టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో తమ బంధువులతో వ్యవహారాలు చక్కబెడుతున్నారని ఫిర్యాదు చేసినట్టు సమాచారం. దీనికి ప్రతిగా ఎమ్మెల్యే మద్దతుదారులు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు టుమెన్ కమిటీపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేగా బండారు శ్రావణి ఉండగా టుమెన్ కమిటీ పెత్తనం నియోజకవర్గంలో ఏమిటని ఆయన ముందు తమ వాదనలు వినిపించడం గమనార్హం. ఎన్నికల్లో ఈ కమిటీకి మద్దతుదారులు కొంత మంది పార్టీకి వ్యతిరేకంగానూ పనిచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎమ్మెల్యేకి అధికారాలుంటయా లేదా అని అధ్యక్షుడిని అడిగారు. ఇలా రెండు గ్రూపులు పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటూ ఉండటం గమనార్హం.

ప్రతి పనిలోనూ పోటాపోటీ

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో పనులేమైనా జరుగుతాయని నియోజకవర్గంలోని టిడిపి ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు పోటీపడుతున్నారు. గ్రూపులతో ఎవరిని సంప్రదించాలో తెలియక అయోమయంలో పడుతున్నారు. అంతేకాకుండా ప్రతి పనిలోనూ వీరి తరుపున రెండు గ్రూపుల మధ్య పోటీ కొనసాగుతోంది. ఈ రకంగా పోటీ పడుతూ రెండు రోజులక్రితం బుక్కరాయసముద్రం పోలీసు స్టేషన్ ఎదుటే రెండు గ్రూపుల మధ్య వివాదం చోటు చేసుకోవడం గమనార్హం. మట్టి తవ్వకాల విషయంలోనూ రెండు గ్రూపులు పోటీలుపడి సవాళ్లు విసరుకున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్యే తరుపున మద్దతుదారులు పోటీపడుతుండగా, అందుకు ప్రతిగా టుమెన్ కమిటీ మద్దతుదారులు పోటీపడుతున్నారు. ఇలా ఇద్దరి మధ్య పోటీలతో అనుకున్న పనులు ముందుకు సాగడం లేదన్న అభిప్రాయాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు అసంతృప్తిని బాహాటంగానే వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

యువతకు ఉపాధి కల్పించేలా శిక్షణ

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో యువతకు ఉపాధి కల్పించే దిశగా జిల్లా నైపుణ్యాభివద్ధి ప్రణాళికను రూపొందించి శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ యువతకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించి, వారికి ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక శ్రామిక శక్తిని బలోపేతం చేయడానికి, ఉపాధిని మెరుగుపరచడానికి, వివిధ రంగాల్లో నైపుణ్యం అంతరాలను తగ్గించడానికి కార్యాచరణ ప్రణాళికలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఉన్న పరిశ్రమలు, వ్యాపార సంస్థలను సంప్రదించి వారి అవసరాలకు అనుగుణంగా జిల్లాలో ఉన్న నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షణ అనంతరం ఆ కంపెనీల్లో ఉద్యోగాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలక్ట్రీషియన్, వైర్‌మెన్, మోటార్ మెకానిక్ విభాగాలతో పాటు టైలరింగ్, ప్లంబర్, కార్పెంటర్, డేటా అనాలసిస్, అకౌంట్స్, ప్రొఫెషనల్ మేకప్ ఆర్టిస్ట్, జూనియర్ సాఫ్ట్వేర్ డెవలపర్, డెబిట్ రికవరీ ఏజెంట్, జెసిబి యంత్రాలు డ్రైవింగ్, అసిస్టెంట్ సర్వేయర్, గ్రౌండ్ నెట్ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్స్ తదితర అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ మేనేజర్ ఖయ్యూం, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, పరిశ్రమ శాఖ జీఎం చాంద్ బాషా, ఎల్‌డిఎం.రమణ కుమార్, వ్యవసాయ శాఖ ఏవో సుబ్బారావు, ఎస్సీ సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్, కియా కంపెనీ ప్రతినిధి జి.రవి శంకర్, మెప్మా ప్రతినిధి వాసుదేవ రెడ్డి, చేనేత శాఖ అధికారి రమేష్ బాబు, ఎస్సీ కార్పొరేషన్ ఏఈవో గీత పాల్గొన్నారు.



మందుల విభాగంలో రికార్డులను పరిశీలన చేస్తున్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

ట్రస్ట్‌లో విద్యార్థినులపై వేధింపులు

నిర్వాహకుని కుమారుడికి దేహశుద్ధి.?

ప్రజాశక్తి-గార్లదిన్నె

గార్లదిన్నె మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఓ ట్రస్ట్‌లో విదార్థునులను వేధిస్తున్న ఘటన వెలుగు చూసింది. విద్యార్థినుల ఫిర్యాదు మేరకు తల్లిదండ్రులు ట్రస్ట్ వద్దకు చేరుకుని వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తికి దేహశుద్ధి చేసినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మండల కేంద్రంలోని రైల్వేగేట్‌కి సమీపంలో ఓ వ్యక్తి గత కొన్ని సంవత్సరాలుగా క్రిస్టియన్ నిధులతో ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నాడు. ఇక్కడ 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తూ, చదువుకు కావాల్సిన పుస్తకాలను ఇతర విద్యాసామగ్రి అందిస్తున్నారు. అయితే గత ఆరు నెలలుగా ట్రస్ట్ నిర్వాహకుని కుమారుడు ట్రస్ట్‌లో చదువుతున్న బాలికలను వివిధ రూపాల్లో వేధింపులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై శుక్రవారం నాడు హాస్టల్లోని బాలికలు వారి తల్లిదండ్రులకు తెలియజేశారు. దీంతో బాలికల తల్లిదండ్రులు ట్రస్టు దగ్గరకు చేరుకుని విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినులు చెప్పినవన్నీ వాస్తవం అని తేలడంతో నిర్వాహకుడు కుమారుడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. కాగా దీనిపై ఇప్పటి వరకు పోలీసులు ఇంకా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. ఘటనపై గార్లదిన్నె, శింగనమల, అనంతపురం పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం తెలిసే అవకాశం ఉంది.

31న స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో జూలై 31వ తేదీన పాలీసెట్ ద్వారా భర్తీ కాని సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.హరీష్ బాబు తెలిపారు. శుక్రవారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాంకేతిక విద్యాశాఖ అధికారుల ఆదేశాలు మేరకు మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇందుకు అర్హులు అన్నారు. పాలీసెట్ ప్రవేశ పరీక్ష రాకపోయిన స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు హాజరు కావొచ్చన్నారు. ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో జూలై 31వ తేదీన ఉదయం 10 గంటలకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. ఎస్పాట్ అడ్మిషన్ కోసం విద్యార్థులు ఫీజు దాదాపు రూ 6,500 చెల్లించాల్సి ఉందన్నారు. పాలీసెట్ కౌన్సిలింగ్ ప్రక్రియ ద్వారా ఇప్పటికే కేటాయింపు పొందిన, కోర్సుల్లో ప్రవేశం తీసుకున్న అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్లకు అర్హులు కాదన్నారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా ప్రవేశం పొందిన అభ్యర్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని తెలిపారు.

బాధితుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని కొడిగేనహళ్లి పంచాయతీ పెదరెడ్డిపల్లికి చెందిన మల్లికార్జున అనారోగ్యంతో ఇంటి వద్ద మంచానికే పరిమితం అయ్యారు.విషయం తెలుసుకున్న స్థానిక టిడిపి నాయకులు మాజీ ఎంపీటీసీ సోమప్ప, మంత్రి సవితమ్మ సోదరుడు మారుతి ప్రసాద్, టిడిపి యువజన విభాగం నాయకులు ప్రవీణ్ రెడ్డి, మాజీ జడ్పిటిసి సూర్యనారాయణ తదితరులు బాధితుడు మల్లికార్జున గృహానికి వెళ్లి పరామర్శించారు. వైద్య ఖర్చులకోసం రూ. 15వేలను అందజేశారు. ఈకార్యక్రమంలో టిడిపి మండల నాయకులు నాగరాజు, పరిగి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతిలో ఉత్తీర్ణత పొందినవారు పాలిసెట్ లో అర్హత పొందనప్పటికీ స్పాట్ అడ్మిషన్లకు అర్హులని తెలిపారు, ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 29వ తేదీ లోపు తమ దరఖాస్తు తో పాటు సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్సులను కళాశాలలో సమర్పించాలని చెప్పారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ఆర్డీటీ క్రీడామైదానంలో ఆర్డీటీ సహకారం తో నాలుగురోజులుగా నిర్వహించిన క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిసాయి. ఈ టోర్నీలో కొత్తపేటలోని మున్సిపల్ బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థుల జట్లు విజేతగా నిలిచినట్లు ఆ పాఠశాల హెచ్ఎం పద్మావతి, పీడీ పద్మబాయ్ తెలిపారు. అదే విధంగా కబడ్డీ పోటీల్లో కూడా ఈ పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు గోరకాటి పెద్దారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్యం నిర్వహణపై కమిషనర్ గరం గరం..!

◆ మూడు రోజుల్లో మెరుగుపడకపోతే చర్యలు ◆ రహమత్ పురం వార్డు పరిశీలనలో కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి



రైల్వే స్టేషన్ ముందు చెత్తను శుభ్రం చేయిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని రహమత్ పురం ప్రాంతంలో అస్తవ్యస్తంగా ఉన్న పారిశుధ్యాన్ని పరిశీలన చేసిన మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి శానిటరీ ఇన్స్‌పెక్టర్, సచివాలయ శానిటరీ సెక్రటరీలపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వార్డులో అపరిశుభ్రం తాండవిస్తోందని, దీనిపై ఎన్నిసార్లు శానిటేషన్ సిబ్బందికి ఫిర్యాదు చేసినప్పటికీ ఏ మాత్రం పట్టించుకోవడంలేదని, పరిశీలన చేసి తగు చర్యలు తీసుకోవాలని వార్డ్ కౌన్సిలర్ షాజియా మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డిని కోరారు. దీనిపై శుక్రవారం ఉదయం కమిషనర్ వార్డులో పర్యటించారు. ప్రధాన రహదారి పక్కన హోటల్ నిర్వాహకులు రోడ్డును ఆక్రమించుకుని పొయ్యిలు పెట్టుకుని వంటలు చేస్తుండాన్ని చూసి హోటల్ నిర్వాహకులపై తీవ్ర అగ్రహాన్ని వ్యక్తం చేశారు. వెంటనే పారిశుధ్య సిబ్బందిని పిలిచి మంటలను ఆర్పించారు. ఇకపై ఎవరైనా రోడ్డును ఆక్రమించుకుని పొయ్యిలు పెట్టుకుని వంటలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోటల్ లోపలే వంటలు చేసుకోవాలని సూచించారు. ఇలాంటివి పునరావృతం అయితే ట్రేడ్ లైసెన్స్ రద్దుచేసి, శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న చెత్తను చూసి సచివాలయ శానిటేషన్ సెక్రటరీని వార్డులో విధులు నిర్వహిస్తున్నారా...? కాలక్షేపం చేస్తున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకపై చెత్త నిలువలు ఉంటే తాము జారీ చేసి, శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్కడే ఉండి రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న చెత్తను శుభ్రం చేయించారు. అనంతరం వార్డులో పర్యటించి మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడాన్ని పరిశీలన చేసి శానిటేషన్ సిబ్బందిపై మండిపడ్డారు. మూడు రోజుల్లో వార్డులో పారిశుధ్యం మెరుగుపరచాలని, లేనిపక్షంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్, సచివాలయ శానిటరీ సెక్రటరీలపై చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఇకపై పట్టణంలో ప్రతి వార్డునూ ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, ఏ వార్డులో పారిశుధ్యం లోపించినా ఆయా సచివాలయ సెక్రటరీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పరిశీలనలో డాక్టర్ బాషా, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

జిల్లా ఎస్పీ వి. రత్న



పుట్టపర్తిలో పోలీసు పెరేడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

అసాంఘిక కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచివేస్తామని జిల్లా ఎస్పీ వి.రత్న పేర్కొన్నారు. శుక్రవారం హిందూపురం రూరల్ అప్ గ్రేడ్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ల ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్ స్టేషన్లలో పరిసరాలు, లాకప్ గదులు, రిసెప్షన్ కౌంటర్‌లను పరిశీలించారు. సిబ్బంది విధులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి గంజాయి, నాటుసారా అక్రమ రవాణా నియంత్రకు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. సరిహద్దు చెక్ పోస్టుల్లో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కంజాక్షన్, సిఐలు శ్రీనివాసులు, ఈరన్న, ఎ.శ్రీనివాసులు ఎస్ఐలు పాల్గొన్నారు.

శాంతికమిటీ సమావేశం : త్వరలో జరిగే వినాయక చవితి ఉత్సవాలను అన్ని వర్గాల ప్రజలు సమన్వయంతో, శాంతియుత వాతావరణంలో జరుపుకునేందుకు కషి చేద్దామని జిల్లా ఎస్పీ వి. రత్న కోరారు. ఇందుకు అన్ని వర్గాల ప్రజలు తమ వంతు సహకారం అందించాలన్నారు. హిందూపురం పట్టణంలోని కె.వి.ఆర్ ఫంక్షన్ హాలులో శుక్రవారం డీఎస్పీ కంజాక్షన్ అధ్యక్షతన వినాయక విగ్రహాల మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవాల శాంతి కమిటీ సమావేశానికి హాజరైన ఎస్పీ పలు సూచనలు సలహాలు చేశారు.

అందరికీ ఆదర్శంగా ఉండాలి

పుట్టపర్తి రూరల్ : పోలీసులు క్రమశిక్షణతో మెలిగి అందరితో ఆదర్శంగా ఉండాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న సూచించారు. జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం ఎఆర్ సాయుధ బలగాలు, హోంగార్డులు నిర్వహించిన పరేడ్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పరేడ్ మరింత నిబద్ధత క్రమశిక్షణతో చేయాలన్నారు. ఆగస్టు 17 నాటికి మరింత మెరుగుపరుచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్ విష్ణు, ఎఆర్ డీఎస్పీ విజయ్ కుమార్, ఆర్ఐలు చంద్రశేఖర్, వలి, పలువురు ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

కారణం తెలుసుకోకుండా ఉద్యోగిపై చర్యలా..?

కమిషనర్‌పై సచివాలయ ఉద్యోగుల ఆగ్రహం



మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ఎందుకు ఆలస్యంగా వచ్చాడో తెలుసుకోకుండా సచివాలయ శానిటేషన్ విభాగపు సెక్రటరీ నాగరాజును మున్సిపల్ కమిషనర్ సస్పెండ్ చేయడం పట్ల సచివాలయ ఉద్యోగుల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. శానిటేషన్ విభాగపు సెక్రటరీ నాగరాజు విధులకు 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చాడని మున్సిపల్ కమిషనర్ రాంకుమార్ ఆయనను సస్పెండ్ చేశారు. కమిషనర్ తీరును నిరసిస్తూ సచివాలయ ఉద్యోగులు శుక్రవారం స్థానిక కమిషనర్ చాంబర్‌ను ముట్టడించారు. అనంతరం కార్యాలయం ఎదుట తమ నిరసనను వ్యక్తంచేశారు. నాగరాజును సస్పెండ్ చేయాలనుకుంటే నిబంధనల ప్రకారం మొదట నోటీసులు ఇచ్చి అనంతరం సస్పెండ్ చేయాల్సి ఉంటుందని అన్నారు. నాగరాజు మార్కెట్‌లోని కార్యాలయంలో మస్టర్లో సంతకం చేసి తిరిగి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండే సచివాలయానికి రావాలంటే కనీసం 15 నిమిషాలు సమయం పడుతుందని అది కూడా ఆలోచిం చకుండా ఏదో వంక పెట్టుకుని ఇలా ఒక ఉద్యోగిని సస్పెండ్ చేయడం తగదని సంఘం నాయకులు అన్నారు. దీనికంతటికి కారణం అసిస్టెంట్ కమిషనర్ అని వారు ఆరోపించారు. వార్డులో పనిచేసే ఉద్యోగులకు కనీస సదుపాయాలు కూడా కల్పించరని ఉన్న సదుపాయాలతోనే విధులు నిర్వర్తిస్తున్న వారిని అభినందించాల్సింది పోయి ఇలా సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీస్తున్నారని అన్నారు. నాలుగు రోజులైన వాహనాలు పంపరని ఎలా చెత్త సేకరణ చేసి పరిశుభ్రతను కాపాడుతారని ప్రశ్నించారు. కార్యాలయంలో కొందరు ఉన్నతాధికారులు కక్ష సాధింపు చర్యలకు దిగడం సహించమన్నారు. ఇప్పటికైనా కమిషనర్ మానవత్వంతో ఆలోచించి సస్పెన్షన్ తొలగించాలని కోరారు.

నాణ్యమైన వైద్య సేవలను..

అందించడమే లక్ష్యం

ఆకస్మిక తనిఖీలో సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం అని ఆసుపత్రి అభివద్ధి తాత్కాలిక కమిటీ చైర్మన్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. ఇటీవల కలెక్టర్ చేతన్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అభివద్ధి కమిటీ లేకపోవడంతో తాత్కాలిక కమిటీ చైర్మన్‌గా పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, కన్వీనర్ గా డిసిహెచ్ఎస్, మెంబర్లుగా జిల్లా ఆడిట్ అధికారి, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్‌లతో కమిటీ వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అభివద్ధి కమిటీ చైర్మన్ హోదాలో సబ్ కలెక్టర్ జిల్లా ఆసుపత్రుల కోఆర్డినేటర్ తిప్పేంద్ర నాయక్, డాక్టర్ శ్రీదేవిలతో కలిసి శుక్రవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపి, మందుల విభాగంతో పాటు వివిధ విభాగాలను ఆయన పరిశీలన చేశారు. రోజుకు ఎంతమంది రోగులు వైద్య సేవల కోసం వస్తున్నారు.. వారందరికీ సరిపడే మందులు ఉన్నాయా.. అన్ని రకాల మందులు ఉన్నాయా.. తదితర విషయాలను మెడికల్ సూపరింటెండెంట్ రోహిల్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి ఆవరణాన్ని మొత్తం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సాధించారన్నారు. అందుకోసమే తాత్కాలిక కమిటీని ఎంపిక చేసి అభివద్ధిపై దష్టి పెట్టాలని ఆదేశించారన్నారు. అందులో భాగంగానే ఆసుపత్రిని తనిఖీ చేశామన్నారు. చిన్నచిన్న పనులను ఆసుపత్రి అభివద్ధి కమిటీ నిధులతో చేపట్టాలని ఆదేశించామన్నారు. ఆసుపత్రి ఆవరణంలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, పారిశుధ్యాన్ని మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని మెడికల్ సూపరింటెండెంట్‌కు సూచించామన్నారు. ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇకపై ప్రతి వారం ఆసుపత్రిని తనిఖీ చేసి ఆసుపత్రి అభివద్ధి తో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి అవసరమైన అన్ని చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివప్రసాద్ రెడ్డి, డాక్టర్ ఆఫ్తాబ్, నందిత తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్ కలెక్టర్ టిఎస్ చేతన్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్లో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్చం అందించి విన్నవించారు. జిల్లాలో పలు తండాల్లో సరైన రహదారులు లేవని వాటిని నిర్మించాలని, జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి తండాకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, శ్మశాన వాటిక లకు తగిన స్థలం కేటాయించాలని ఆయన కోరారు. ఎస్టీ వసతిగృహాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అవసరమైన చోట పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సమాఖ్య ఉపాధ్యక్షులు మల్లికార్జున నాయక్, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు, ఎస్ఒ శ్రీనివాస నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే ఆర్టీసీ లక్ష్యం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యాలకు చేర్చడమే లక్ష్యంగా ఆర్టీసీ సిబ్బంది పనిచేయాలని జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి మధుసూదన్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో జిల్లాలోని ఆర్టీసీ డిపో మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజీ, అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఆదాయాన్ని పెంపొందించే దిశగా చర్యలు తీసుకొని రాష్ట్రంలోనే జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు సమిష్టిగా పనిచేయాలని కోరారు.కండక్టర్లకు డ్రైవర్లకు గ్యారేజీ సిబ్బందికి అవగాహన శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. దూర ప్రాంత సర్వీసులతో వెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా బస్సులను కండిషన్లో ఉంచాలన్నారు. ప్రయాణికుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక టూరు ప్యాకేజీ ఏర్పాటు చేసి బస్సులను నడపాలన్నారు. అయోధ్య, అరుణాచలం, శ్రీరంగపట్నం, రామేశ్వరం తోపాటు పాలపాటిదిన్నె, మురడి, నేమకల్లు, కసాపురం, తదితర పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటు చేసి బస్సులను నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆర్టీసీ డిపో మేనేజర్లు, గ్యారేజీ, సూపర్వైజర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజారవాణా శాఖాధికారి

కార్గిల్ అమరవీరులకు నివాళి


కొత్తచెరువులో అమరవీరులకు నివాళి



కదిరిలో ర్యాలీ


మడకశిరలో మాజీ సైనికుడికి సన్మానం

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు. కొత్తచెరువు మండల పరిధిలోని కె లోచర్ల గ్రామ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారతీయ జవాన్లు అనిల్ కుమార్, బాలరాజు, ముకేష్, రాజు, జనసేన మండల అధ్యక్షుడు పూల శివప్రసాద్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భానుప్రియ, శ్రీదేవి, యాజమాన్యం, విద్యార్థుల సమక్షంలో అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యార్థులతో 100 అడుగుల జాతీయ జెండా తో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : కార్గిల్ యుద్ధంలో దేశం కోసం పోరాడి అమరులైన వీర సైనిక త్యాగాలను స్మరించుకుంటూ స్థానిక ఓబులేష్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం స్థానిక బాలుర పాఠశాల గ్రౌండ్ నుంచి జాతీయ రహదారిపై వినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఓబులేష్ డిఫెన్స్ అకాడమీ కళాశాల నిర్వాహకులు ప్రభాకర్ రెడ్డి, శరత్ కుమార్ రెడ్డి, ఓబులేష్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : కార్గిల్ దివస్ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న స్థానికుడైన రిటైర్డ్ కెప్టెన్ అంజిరెడ్డిని శుక్రవారం స్థానిక నాయకులు చంద్రశేఖర్ లక్ష్మీనారాయణ, ఆర్‌వి. గుప్తా, నాగరాజు, మట్టి లక్ష్మీనారాయణ, నారాయణప్ప ఆధ్వర్యంలో అంజిరెడ్డిని సన్మానించారు.

కదిరి టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సిసి, ఆర్మీ విభాగాల ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ స్మిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ సైనికుల త్యాగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంతర్గత నాణ్యతా భరోసా విభాగాధిపతి డాక్టర్. హైదర్ అలీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికుల త్యాగాలను మరువరాదని కెవిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీని ఎన్‌సిసి వాలంటీర్లు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్మీ జవాన్ల త్యాగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి పావని, కళాశాల అధ్యాపకులు షమీవుల్లా, కిరణ్‌కుమార్, భువనేశ్వరి, వెంకటలక్ష్మి, పుష్పవతి, తాహిర్, మీనా, ఆనంద్, గంగా తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : కార్గిల్ యుద్ధం జరిగి 25 సంవత్సరాలు అయిన సందర్భంగా ముదిగుబ్బలో మాజీ ఆర్మీజవాన్ ఆలం ఆలీని కూటమి నాయకులు శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమల ప్రకాష్ నాయుడు, తుమ్మల మనోహర్, జయచంద్ర, వసుపులేటి వెంకటేష్, నాగభూషణ ,కిషోర్, వని, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఎరుకల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎరుకల ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బిజిలి గంగులప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన ఎరుకల అభివృద్ధి జరగాలంటే నిధులతో కూడిన ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఎరుకల బ్యాంకుల ద్వారా ఎలాంటి షరతులు లేకుండా మూడు లక్షల రూపాయల వరకు రుణ సదుపాయం కల్పించాలన్నారు. అదేవిధంగా ప్రతి జిల్లా కేంద్రంలోనూ ప్రతి మండల కేంద్రంలోనూ ఏకలవ్య భవనం కోసం స్థలం కేటాయించి భవన నిర్మాణానికి ప్రభుత్వం తగిన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సమాజాభివృద్ధికి మీడియా తోడ్పాటు అందించాలి


మాసపత్రికను ఆవిష్కరిస్తున్న రత్నాకర్, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

సమాజ అభివృద్ధికి మీడియా తగిన తోడ్పాటును అందించాలని వాస్తవ కథనాలను ప్రచారం చేయాలని బాధితుల పక్షాన నిలబడాలని సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె. రత్నాకర్ సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తన స్వగృహం వద్ద ధర్మ విజేత తెలుగు మాస పత్రికను ప్రారంభించారు. వెన్నెల న్యూస్ టీవీ, ధర్మ విజేత మాసపత్రిక నిర్వాహకులు సీనియర్ పాత్రికేయులు డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రత్నాకర్ మాట్లాడుతూ సామాజిక చైతన్యంతో కూడిన వాస్తవ కథనాలను ప్రచారం చేయాలని సూచించారు. ఆధ్యాత్మిక అభివృద్ధి నైతిక విలువలతో పాటు సామాజిక ప్రయోజనంతో కూడిన వార్తలను ప్రచురించాలన్నారు. సత్య సాయి సెంట్రల్ ట్రస్టు అందిస్తున్న సేవా కార్యక్రమాలపై మానవతా మూర్తి అనే

సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్

శీర్షికన వెన్నెల న్యూస్ టీవీ రూపొందించిన ప్రత్యేక కథనాన్ని ఆయన ప్రారంభించారు. పాత్రికేయ విలువలతో వెన్నెల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాను నిర్వహించాలని దిగ్విజయంగా ముందుకు నడిపించాలని యాజమాన్యానికి సూచించారు. అనంతరం వెన్నెల టీవీ యాజమాన్యం రత్నాకర్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించింది. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, వెన్నెల మీడియా హౌస్ సిబ్బంది సతీష్, రాజేష్, పవన్, షాకీర్, నారాయణస్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఆధార్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - లేపాక్షి

పిల్లలకు ఈనెల 30వ తేదీలోపు ఆధార్ నమోదు చేయించాలని సిడిపిఒ రెడ్డిరమణమ్మ తెలిపారు. మండల పరిధిలోని మానేపల్లి, పులమతి సెక్టర్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసమావేశంలో పాల్గొన్న సిడిపిఒ మాట్లాడుతూ ఉదయం 9గంట ల నుండి సాయంత్రం 4గంటల వరకు అంగన్వాడీ కేంద్రాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు మంజులమ్మ, శ్రీలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు గౌరమ్మ, శివమ్మ, ధనమ్మ, భాగ్యమ్మ, మాధవి, సుజాతమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

స్నేహపూర్వకంగా విద్యాబోధన

ప్రజాశక్తి-హిందూపురం


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఈఒ మీనాక్షి

పట్టణంలోని ఎంజిఎం పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణా తరగతులను డిఈఒ మీనాక్షి శుక్రవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు శిక్షణ పొందిన తర్వాత పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు స్నేహ స్నేహపూర్వకంగా విద్యా బోధన సాగించాలని సూచించారు. విద్యార్థుల భావనలను వ్యక్తపరిచే విధంగా విద్యలో సరైన అవగాహన కల్పించాలని, పరిశీలనకు వెళ్లినప్పుడు స్నేహపూర్వకంగా తీసుకోవాలని, విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ హెచ్.గంగప్ప, ఎంఇఒ మహేందర్ రెడ్డి, పరిశీలకులు అబ్రహం, ఆర్‌పిలు రాజు, ఓబులేసు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం : కాంగ్రెస్

ప్రజాశక్తి - కదిరి టౌన్

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్ర రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని శ్రీ సత్య సాయి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కదిరప్ప విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్లు అప్పుగా కాకుండా నేరుగా గ్రాంట్ ప్రకటించాలన్నారు. అప్పుగా ఇవ్వడం వల్ల రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి వెళుతుందన్నారు. విభజన చట్టం ప్రకారం 2014 నుంచి వెనుకబడిన ప్రాంతాలకు 2వేల కోట్ల రూపాయలు విడుదల చేయాలన్నారు. ప్రత్యేక హోదా విషయాన్ని గాలికి వదిలేశారని విమర్శించారు. రైల్వే జోన్, కడప ఉక్కు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ. 4వేల కోట్లు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. 970 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతాన్ని టూరిజం డెవలప్‌మెంట్‌గా చేయాలన్నారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి పార్లమెంట్‌లో రాష్ట్ర ఎంపీలు గళం విప్పాలన్నారు.

శ్మశానవాటికలో బోరుబావి తవ్వకం

ప్రజాశక్తి బత్తలపల్లి

శ్మశాన వాటికలో కర్మ క్రియలు నిర్వహించడానికి దాత నారపరెడ్డిగారి లింగారెడ్డి ఉచితంగా బోరు వేయించారు. మండలంలోని అప్రాచెరువు గ్రామంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియల సమయంలో కర్మ క్రియలు నిర్వహించాలంటే నీటి సమస్యతో ఇబ్బంది పడేవారు. గ్రామానికి చెందిన దాత నారపరెడ్డిగారి లింగారెడ్డి శుక్రవారం శ్మశాన వాటికలో బోరు వేయించి దాతృత్వాన్ని చాటుకున్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి


ప్రతిభా విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

వికలాంగులు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మ విశ్వాసంతో ముందుకెళితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వికలాంగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డితో పాటు ఉప విద్యాధికారి రంగస్వామి, మండల విద్యాశాఖ అధికారులు గంగప్ప, ప్రసన్నలక్ష్మి ఐఇడి కోఆర్డినేటర్ ఆనందబాబు, టిడిపి నాయకులు, వార్డు కౌన్సిలర్ డిఇ. రమేష్ కుమార్, మంగేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగులు ప్రతిభ పాటవాల్లో ఎవరికీ తీసిపోరని, వారికి ప్రోత్సాహం అందించి ముందుకెళ్లేలా సహకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. అంగవైకల్యం శాపం కాదని, ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిపిస్తే వికలాంగులు అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తారని పేర్కొన్నారు. విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపించి వారిని పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడానికి కృషిచేసిన భవిత పాఠశాల ఆర్‌పిలు లలిత, నందిని, గంగరత్నమ్మను అభినందించారు. అనంతరం చిన్నారులకు శాలువా కప్పి సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తరపున చిన్నారులకు రూ.10 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎం ప్రధానోపాధ్యాయులు సామ్రాజ్యం, రమాదేవితో, ఎఎంఒ మహేంద్రరెడ్డి, భవిత పాఠశాల పర్సన్స్ లలిత, నందిని, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - ఓబులదేవర చెరువు

మండల వ్యాప్తంగా ఆర్‌ఎంపీలు నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాలను వైద్యాధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. తగిన అర్హత కలిగి ప్రభుత్వ నియమ, నిబంధనలను అనుసరిస్తూ ప్రజలకు చికిత్ససేవలను అందించాలని డాక్టర్ జోష్న, డాక్టర్ సునీల్ వారికి సూచించారు. నిర్వహిస్తున్న చికిత్స కేంద్రాలను, వారి సర్టిఫికెట్లను పరిశీలించి నివేదికను తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు సమర్పిస్తున్నట్లు వీరు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కమల్ రోహిత్, ఆరోగ్య విస్తరణాధికారి నాగేష్, ఆరోగ్య విద్య బోధకులు సుశీలమ్మ, బషీర, నాగమణి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

28న ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో ఈనెల 28న ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాలాచార్యులు, రమేష్‌బాబు, కోశాధికారి నాగేంద్ర తెలిపారు. ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల హెచ్ఎం శైలజ, విశిష్ట అతిథి సీనియర్ జర్నలిస్టు మార్కండేయులు వైద్యశిబిరం ప్రారంభోత్సవానికి హాజరవుతు న్నారన్నారు.

పేదలకు భూమి దక్కే వరకు పోరాటం

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండల సమీపంలో కోట్లాది రూపాయలు విలువ చేసే నిడిమామిడి మఠానికి చెందిన భూమిని పేద ప్రజలకు దక్కేవరకు ప్రజా ఉద్యమంతో పోరాడుతామని సిపిఐ ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు పేర్కొన్నారు. నిడిమామిడి మఠం భూమిని సిపిఐ ఆధ్వర్యంలో భూ ఆక్రమణ చేపట్టగా గత 17 రోజులుగా పేదలు గుడిసెలను వేసుకొని అక్కడే నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముదు నియోజకవర్గ సిపిఐ నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే అనుచరులు ఈభూమిని కబ్జా చేయడానికి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి అమ్మకాలు సాగించినట్లు గుర్తించామన్నారు. అర్హులైన పేదలందరికీ నివేశ స్థలాలు దక్కేవరకు సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ చేనేత సంఘం రాష్ట్ర నాయకులు జింకా చలపతి, సిపిఐ మండల కార్యదర్శి బందల వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మాల్యవంతం కుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

ప్రజాశక్తి-హిందూపురం

మాదకద్రవ్యాలను ఉపయోగించడం వల్ల శారీరకంగా ఎన్నో దుష్పరిణామాలు చోటు చేసుకుంటాయని వక్తలు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలాజీ కళాశాలలో సెబ్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని పోటుచేసుకునే అనర్థాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక ప్రతినిధి డాక్టర్ ఈటే రామ్మూర్తి మాట్లాడుతూ సమాజంలో యువత మాదకద్రవ్యాల బారిన పడి తమ జీవితాల్ని బుగ్గిపాలు చేసుకుంటోందనిఆందోళన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యపరంగా శారీరానికి నష్టం వాటిల్లడంతో పాటు సామాజిక అశాంతికి కారణం అవుతున్నాయని అన్నారు. ప్రముఖ మానసిక నిపుణులు డాక్టర్ జీవన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వాడకం వల్ల యువత శారీరకంగా, మానసికంగా జీవితాన్ని ఏ విధంగా కోల్పోతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ కళాశాల ప్రిన్సిపల్ వీరభద్రప్ప, సెబ్ ఇన్స్‌పెక్టర్ రాజశేఖర్ గౌడ్, ఎస్ఐలు కమలాకర్, రామప్రసాద్, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండలంలోని ఆయా గ్రామపంచాయతీల్లో అధికారులు ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని రామవారి పల్లి, పైపల్లి గ్రామాల్లో శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహించి, గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు, శుభ్రత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పై పల్లి, రామవారి పల్లి సర్పంచులు ప్రవీణ్, వెంకటప్ప, గ్రామ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో విధ్వంసంపై బహిరంగ చర్చకు సిద్ధమా : టిడిపి


విలేకరుల సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

ప్రశాంతంగా ఉన్న చిలమత్తూరుని ఫ్యాక్షన్ మండలంగా మార్చిన ఘనత వైసిపి ఎంపిపి పురుషోత్తమ రెడ్డి దే అని స్థానిక జెడ్పీటీసీ మాజీ నాగరాజు యాదవ్ విమర్శించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో జరిగిన విధ్వంసంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. చేయాల్సిందంతా చేసి ఇప్పుడు శాంతి భద్రతలను కాపాడాలని ఎస్పీ వద్దకు వెళ్లడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. 50 ఏళ్లలో ఎన్నికల సందర్భంగా మండలంలో ఎక్కడా విధ్వంసకర ఘటనలు జరిగిన దాఖలాలు లేవని అన్నారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో ఎంపిపి సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదని అన్నారు. ప్రజా స్వామ్యంలో సమస్యలపై విన్నవించే నిరసన హక్కు తమకు ఉందని సమాధానం చెప్పే ధైర్యం లేక సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసుకొని నాటకాలు ఆడుతున్నాడని విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలనుకుంటే ప్రజా సామ్య పద్ధతిలో సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అంజినప్ప, రాష్ట్ర నాయకులు గోరీశంకర్, కొడికొండ బాలాజీ, బయప్ప నందీశప్ప, అశ్వర్థప్ప, నాగరాజు స్వామి, సోము, శ్రీదేవి, వెంకటేష్, చౌడప్ప, గంగప్ప, నారాయణస్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

పెనుకొండ : మండలంలోని వెంకటాపురంతండాలో ఉన్న మారెమ్మగుడిలో దొంగతనం జరిగినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు గుడి తలుపుల తాళం పగలకొట్టి మారెమ్మ విగ్రహానికిఉన్న 40 గ్రాముల వెండి నగలు, హుండి, బీరువాలో ఉన్న నగదు దోచుకెళ్లారని ఆయన వివరించారు. ఈ నెల మొదటి వారంలో ఇదే తండాలోని ఆంజనేయస్వామిగుడి లో కూడా దొంగతనం జరిగిందని గ్రామస్తులు తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

పరిగి : మండలంలోని కొడిగనహళ్లి ఉరిశివల్లో గుర్తుతెలియని మహిళ మృత దేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సత్యనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి సమాచారం తెలిసిన వారు తమను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

ఎస్‌బిఐ సేవా కేంద్రంలో చోరీ

హిందూపురం : పట్టణంలోని లేపాక్షికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న ఎస్‌బిఐ సేవా కేంద్రంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు షాపు షట్టర్ తాళాలు పగల గొట్టి సేవా కేంద్రంలో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. సేవా కేంద్రం నిర్వాహకుడు రమేష్ బాబు ఈ సంఘటనపై టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొత్తం రూ.6లక్షల వరకు నగదు ఉండగా అందులో రూ.4లక్షలు గురువారం రాత్రి ఇంటికి తీసుకెళ్లానని మిగిలిన రూ.1లక్ష సేవా కేంద్రంలో నిల్వ చేశానని తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అనారోగ్యంతో విఆర్ఎ మృతి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

మండలంలోని పోతుల నాగేపల్లి గ్రామ రెవెన్యూ సహాయకుడు ఓబన్న అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ రమేష్ ఆదేశాల మేరకు డిటి ఈశ్వరయ్య, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ భాస్కర్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అంత్యక్రియ ఖర్చులకు గాను 25 వేల రూపాయల నగదును మృతుని కుటుంబానికి అందజేశారు.

30న బహిరంగ వేలం

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించిన వస్తువులను ఈనెల 30న బహిరంగ వేలం వేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేవాలయానికి చెందిన బియ్యం, ఖాళీడబ్బాల వేలం వేయనున్నట్లు చెప్పారు. వేలం పాట పాడేవారు రూ. 50వేలు డిపాజిటుడు చేయాలన్నారు. ఇతర వివరాలను దేవాలయ కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

కేజీబీవీ తనిఖీ

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని కట్టారుపల్లి క్రాస్ వద్ద ఉన్న కేజీబీవీని ఎంపిడిఒ రామానాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు, వంటగది, హాజరు పట్టిక తదితరవాటిని పరిశీలించారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఎస్ఒ దుర్గను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపునకు కృషి

ప్రజాశక్తి - కొత్తచెరువు

పచ్చదనం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మానవ హక్కుల సంఘం నాయకుడు భాస్కర్ నాయుడు అన్నారు. స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెట్లను పెంచి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. అనంతరం విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ

ప్రజాశక్తి - బత్తలపల్లి

తాడిమర్రి మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలను మండల ప్రత్యేక అధికారి విజయప్రసాద్, ఎంపీడీవో మణిమందిర శుక్రవారం తనిఖీ చేశారు. వైద్యశాలలోని రికార్డులను, శానిటేషన్ పనులను, లేబర్ వార్డును తనిఖీ చేశారు అనంతరం డాక్టర్ హరిత, డాక్టర్ గోవర్ధన నాయుడులతో హెల్త్‌సెంటర్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది రోగుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని వచ్చిన వెంటనే పరీక్షించి మందులను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కోటి గురుమూర్తి వర్ధంతి

ప్రజాశక్తి - బత్తలపల్లి


అనాథాశ్రమంలో అన్నదానం

మండలంలోని బీసీ వర్గాల నాయకుడు కోటి గురుమూర్తి 34వ వర్ధంతి వేడుకలను ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మధ్య ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని కోటి గురుమూర్తి స్మృతివనంలో వర్ధంతి వేడుకలను నిర్వహించారు. అనంతరం అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురుమూర్తి కుటుంబ సభ్యులు కోటి గంగులప్ప, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్ కుమార్, మల్లీశ్వరి, వైసిపి మండల ఉపాధ్యక్షులు కోటి సురేష్ కుమార్, మమత తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయండి

ప్రజాశక్తి-సోమందేపల్లి

హైకోర్టు ఉత్తర్వులు పాటించి మండల కేంద్రంలోని సర్వేనెంబర్ 700 లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు ఏర్పాటు చేసుకున్న పేదలకు న్యాయం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి బాలస్వామి కోరారు. ఈ మేరకు ఆయన బాధితులతో కలిసి శుక్రవారం స్థానిక తహశీల్దార్ అంజనాదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 700లోని భూమిలో ఆరు నెలలుగా గుడిసెలు వేసుకొని జీవిస్తూ అనంతరం సిమెంట్ ఇటుకలతో పేదలు గృహాలు నిర్మించుకున్నారన్నారు. అయితే మండల అధికారులు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా ఇళ్లను కూల్చి వేశారని విమర్శించారు. ఈ నేపథ్యంలో బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా న్యాయస్థానం పేదల పక్షాన నిలుస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. మండల అధికారులు ఉన్నత న్యాయస్థాన ఉత్తర్వులు పాటిస్తూ పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి గృహాలు మంజూరు చేసి నష్టపోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూ పోరాట ఇళ్ల స్థలాల సాధన కమిటీ మండల అధ్యక్షులు నూర్జహాన్, ఉపాధ్యక్షులు భారతి, చౌడమ్మ, సునీత, ఓబులేసు, అంజనేయులు, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

కియా ఇండియా ఆధ్వర్యంలో మొబైల్ వైద్యకేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రజాసేవలో కియా ఇండియా ముందుకు వెళుతోందని కియా ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్బాంగ్‌లీ అన్నారు. శుక్రవారం మండలం లోని గుట్టూరు ప్రాథమిక వైద్యశాలలో ప్రభాత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కియా ఇండియా సహకారంతో ఏర్పాటు చేసిన ఎ కేర్ ఆన్ వీల్స్ మొబైల్ వాహనాన్ని ప్రారంభించారు. అదేవిధంగా గుట్టూరు జడ్పీ హైస్కూల్లో విద్యార్థుల సౌకర్యార్థ భోజనశాల భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ తో కలిసి గుట్టూరు గ్రామంలో సోలార్ వీధిలైట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కియా ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్బాంగ్ లీతో పాటు ప్రభాత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, మంజునాథ్ నేత్రాలయ, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ప్రతినిధులు, సర్పంచ్ నాగరత్నమ్మ, కియా ప్రతినిధులు తేజస్వి, సీమ రంజన్ తదితరులు పాల్గొన్నారు.